కాంట్రాక్టు కార్మికుల నిరసన

సిద్దిపేట, ఏప్రిల్ 6: నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారని సిద్దిపేట జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట దవాఖానలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నెలల కొద్ది జీతాలు ఇవ్వకుంటే ఎలా జీవనం కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు అడిగితే ఉద్యోగం నుంచి తీసివేస్తామని కాంట్రాక్టర్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 6 : కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్‌తో కలిసి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. రాంపల్లిలో రైతు విభాగం అధ్యక్షుడు కానుగంటి రాజిరెడ్డి తల్లి ఇటీవల మృతిచెందిగా రాజిరెడ్డి కుటుంబాన్ని, దవాఖానలో చికిత్స పొందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుక రాజిరెడ్డి, సిరిసినగండ్లలో గుండె ఆపరేషన్ చేయించుకున్న మాజీ సర్పంచ్ రాజగిరి శ్రీనివాస్, తిమ్మారెడ్డిపల్లిలో ఎర్రగోళ్ల బాలయ్య తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఎండీ.అహ్మద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

యుద్ధ భేరి విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి, ఏప్రిల్ 6: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దాసరి విజయ గార్డెన్‌లో ఆదివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించే యుద్ధభేరి సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నాయకులు మేకల రవీందర్, బోనగిరి ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు బిగుళ్ల మోహన్, బాలనర్సు, పరశురాములు, ఆనంద్, యాదగిరి, కుమార్ పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

సిద్దిపేటలో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 6: సిద్దిపేట నియోజకవర్గ స్థాయి విద్యార్థి ,యువత, సోషల్ మీడియా శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేశ్, జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 8వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండ మల్లయ్య గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఆత్మీయ అతిథిగా మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. చిన్నకోడూరు విద్యార్థి యువ అధ్యక్షుడు గుండెలు వేణు, గుజ్జ రాజు, సోషల్ మీడియా కన్వీనర్లు గుడిమల్ల రాజ లింగం, సీనియర్ నాయకులు భిక్షపతి, చెట్టు పల్లి భానుచందర్, రాజశేఖర్‌రెడ్డి, ఎండీ షాదుల్, చందు, రమేశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో బేకరీ సీజ్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: బూజుపట్టిన కేక్ ఇచ్చారనే ఫిర్యాదు మేరకు పట్టణంలోని మంజునాథ బేకరీని శనివారం సాయంత్రం సీజ్ చేసినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం తెలిపారు. పట్టణానికిచెందిన గజ్జెల సాగర్ తన కొడుకు పుట్టినరోజు సందర్భంగా బేకరీ నుంచి కేక్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి వేడుకలు నిర్వహించి కేక్ తినడంతోనే వాంతులయ్యాయి. దీంతో కేక్‌ను పరిశీలించగా బూజు పట్టి ఉండటంతో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం బేకరీని తనిఖీచేసి పాడైపోయిన కేక్‌ను స్వాధీనం చేసుకుని దుకాణాన్ని సీజ్‌చేశారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6: ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది,న్యాయవాదులు,కక్షిదారులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జడ్జిలు, కోర్టు సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

నేడు మల్లన్న చివరి ఆదివారం

చేర్యాల, ఏప్రిల్ 6: కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో నేడు 12వ (చివరి) ఆదివారంతో పాటు అగ్నిగుండాల కార్యక్రమం ఉండడంతో రాష్ట్రం నలుమూల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. స్వామివారి చివరి ఆదివారం సందర్భంగా వరంగల్, కరీంనగర్, మెదక్ తదితర పూర్వపు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకోనున్నారు. అర్ధరాత్రి ఆలయవర్గాల ఆధ్వర్యంలో నిర్వహించే అగ్నిగుండాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం ఆలయ పాలక మండలి, సిబ్బంది సేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. స్వామివారి ఉత్సవాలు పూర్తయినా మరో రెండు వారాల పాటు భక్తులు రాక ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సమస్యపై సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఇందుకు ప్రతి ఇంటికి వెళ్లి నీటి సరఫరా అవుతుందో లేదో పరిశీలించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఏఈ సాయి ప్రణీత్, వార్డు అధికారులు, తాగునీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరిపంట పూర్తిగా ఎండిపోయిందని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘాల సమాఖ్య నేతలు శనివారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘాల నేతలు రామచంద్రర్‌రావు, రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 6: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం కావడంతో పాటు ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని మునిగడపలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వడ్డె తిరుపతి భార్య కనకవ్వ శనివారం గ్యాస్ పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి సిలిండర్ పేలింది. దీంతో ఇంట్లో మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. వస్తువులు కాలిపోగా ఇంట్లో ఉన్న కనకవ్వ, ఆమె కూతురు అశ్విని గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ. 20వేల ఆస్తినష్టం జరిగినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బీఆర్ఎస్ సిద్దిపేట రూరల్ మండల సమావేశం

ఇర్కోడులో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఓటర్లను కోరారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు గ్రామ పరిధిలోని లావణ్య గార్డెన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వచ్చి ఓట్లు అడిగే అర్హత కోల్పోయారన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకోవడం లేదని, అందుకే ఎంపీ ఎన్నికల్లో సురుకు అంటించాలని కోరారు. రైతుబంధు రూ.15 వేలు, ఆడబిడ్డలకు నెలకు రూ.2500, పెండ్లికి లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. సిద్దిపేట అభివృద్ధిని చూసి ఓర్వలేని వాళ్లకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. వంద కోట్ల సొంత డబ్బుతో పీవీఆర్ ట్రస్టుతో సేవచేయడానికి సిద్ధంగా ఉన్న బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని పార్లమెంట్‌కు పంపాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేయడానికి వచ్చానని, ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కలెక్టర్‌గా ఉన్న సమయంలో పేదల కష్టాలు దగ్గరగా చూశానని, పార్లమెంట్‌లో ఇక్కడి సమస్యలపై గళం విప్పి నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, గొర్రెల పెంపకందారుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరియాదవ్, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షుడు మామిడి మోహన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవీరామచందర్‌రావు, వైస్ ఎంపీపీ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలకిషన్‌రావు, శ్రీనివాసరావు, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రొడ్డ యాదగిరి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, బీఆర్ఎస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో ఇఫ్తార్ విందు

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి పండ్లు తినిపిస్తున్న సయ్యద్ రహీముద్దీన్

రాయపోల్, ఏప్రిల్ 6: రంజాన్ పండుగ సందర్భంగా శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ముస్లింలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రహీముద్దీన్ కొత్త ప్రభాకర్‌రెడ్డికి పండ్లు తినిపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు దార సత్యనారాయణ, నర్రా రాజేందర్, సయ్యద్ కలిమొద్దీన్, ఉమ్మడి నర్సింహారెడ్డి యాదవ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

హుస్నాబాద్ రైతుదీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హామీలు నెరవేర్చకుంటే గ్రామాల్లో తిరగనివ్వం

- హుస్నాబాద్ రైతు దీక్షలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 6: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గ వరప్రదాయిని అయిన గౌరవెల్లి రిజర్వాయర్‌ను కాళేశ్వరం, మిడ్‌మానేరు, తోటపల్లి ద్వారా గోదావరి నీళ్లతో నింపాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిండితే భూగర్భజలాలు పెరిగి కనీసం తాగునీటికి ఇబ్బందులు తప్పుతాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ కోర్టుల్లో వేయించిన కేసులను కొట్టివేయించి వెంటనే గౌరవెల్లిలో నీళ్లు నింపాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తోటపల్లి రిజర్వాయర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు నీళ్లొచ్చాయని, యాసంగి పూర్తి కాకముందే వాటిని కూడా బంద్ చేయించిన ఘనత పొన్నం ప్రభాకర్‌కే దక్కుతుందని విమర్శించారు. మార్నింగ్ వాక్‌లు తప్ప ప్రజాసమస్యలు మంత్రికి పట్టడం లేదని ఎద్దేవాచేశారు. దేవాదుల ద్వారా సాగునీరందే భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాలకు కూడా నీళ్లివ్వడంలో మంత్రి విఫలమయ్యారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం మిషన్ కాకతీయ, రైతు బంధు, రైతు బీమా, రుణ మాఫీ, పుష్కలంగా ఎరువులు, విత్తనాలు ఇచ్చి ఆదుకున్న ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం, ప్రతి మహిళకు రూ.2,500 నగదు, రూ.4వేల నిరుద్యోగ భృతి, వడ్డీలేని స్వశక్తి రుణాలు ఇవ్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఎంపీపీలు మానస, లక్ష్మి, అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఆవుల మహేందర్, మామిడి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు అన్వర్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రామిరెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, బీలూనాయక్, ఆకుల వెంకట్, బిల్ల వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీపతి రవీందర్, పొన్నాల లక్ష్మణ్, తిప్పారపు శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, వాల సుప్రజ, బొజ్జ హరీశ్, కృష్ణమాచారి, రామచంద్రనాయక్, తిరుపతినాయక్, రవీందర్‌గౌడ్, ఏడు మండలాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువా కప్పుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బీఆర్ఎస్‌లో చేరికల జోరు

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో శనివారం బీఎస్పీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మద్దెల నర్సింహులు తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రజలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. విద్యాలయాలకు నిలయంగా సిద్దిపేట రూపుదిద్దుకుందన్నారు. తాగునీటి సమస్య లేకుండా చేశామన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి వంద కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన వెంకటేశ్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పిట్ల వెంకటేశ్

తొగుట ఏప్రిల్ 6: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు, వార్డు సభ్యుడు పిట్ల వెంకటేశ్ శనివారం ఎర్రవల్లి పామ్‌హౌస్‌లో గులాబీ అధినేత కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి వంద రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, భవిష్యత్‌లో గులాబీ జెండా ఎగురవేస్తామని పిట్ల వెంకటేశ్ అన్నారు.

శేఖర్‌రావుపేట అంటే ఆత్మీయత..అభిమానం



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నారాయణరావుపేట, ఏప్రిల్ 6: మండలంలోని శేఖర్‌రావుపేటలో శనివారం పెద్దమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి ఆశీర్వాదం... మీ అందరి ఆత్మీయత కోరేందుకు మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మీ ముందుకు వచ్చారని.. మీ నిండు మనస్సు.. దీవెన ఉండాలన్నారు. శేఖర్‌రావుపేట గ్రామం అంటే ఆత్మీయత... ప్రేమ అభిమానమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల ఏరువాక

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6: తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. చిరుసంచి సుడిదోమ, అగ్గి తెగులు, కాండం కుళ్లు తెగులును తట్టుకోవడమే కాక గింజపై ఎలాంటి మచ్చలు రాకుండా ఉండే సన్న గింజరకం మంచి దిగుబడి ఇస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకన్న, ప్రధాన శాస్త్రవేత్త సతీశ్‌చంద్ర, సీహెచ్ పల్లవి, ఏరువాక తోర్నాల కేంద్రం శాస్త్రవేత్తలు, 16 మంది రైతులు పాల్గొన్నారు.

చామల సోదరుడి పూజలు

చేర్యాల, ఏప్రిల్ 6: భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించాలని కోరుతూ ఆయన సోదరుడు అనిల్‌రెడ్డి కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శనివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తుక్కుగూడ సభకు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి
- జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ
- తాగునీటి సమస్య రాకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టాం
- కలెక్టర్ మనుచౌదరి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 6: ఎండిపోయిన పంటలకు పరిహారం అందించే విధంగా అధికారులు ప్రభుత్వానికి నివేదించాలని జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో ఆమె అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయం, మిషన్ భగీరథ, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ అధికారులు తమ పురోగతిపై వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడమే కాకుండా నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కొంత మంది సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ.. ఎండాకాలంలో తాగునీటి కొరత రాకుండా మిషన్ భగీరథ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, గృహ అవసరాలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. హరిత హారం మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వడదెబ్బ నివారణకు వైద్యారోగ్యశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని.. ఉపాధి హామీ పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. అవసరమైన మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ఎక్కడైనా నీటి సమస్యలు తలెత్తితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08457 230000 నెంబర్‌ను సంప్రదిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు 418 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కేంద్రం కొనుగోలు చేయగా.. మిగిలిన పొద్దుతిరుగుడు విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. అంతకుముందు మొదటిసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి వచ్చిన కలెక్టర్ మనుచౌదరి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

రాయపోల్, ఏప్రిల్ 6: దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లిలో అభయాంజనేయ శివపంచాయతన వార్షికోత్సవం నేటి నుంచి జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్, తాజా మాజీ సర్పంచ్ దారా సత్యనారాయణ తెలిపారు.ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దేవాలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగతాయన్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకం, హోమం, శివపార్వతుల కల్యాణం ఉంటుందన్నారు.

అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

గజ్వేల్, ఏప్రిల్ 6: అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. శనివారం సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే వర్ధంతి సందర్భంగా గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రంగారెడ్డి, రవి, మహేందర్‌రెడ్డి, రాజు, లింగం పాల్గొన్నారు.

చేర్యాలో...

చేర్యాల, ఏప్రిల్ 6: సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ కోరారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే వర్ధంతిని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్, నాయకులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, ముస్త్యా